క్లుప్తంగా

ఉపాధి మస్టర్ల అవినీతిపై చర్యలేవి?

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం పంచాయతీలో ఉపాధి హామీ మస్టర్లలో అ వినీతిపై చర్యలు చేపట్టలేదంటూ జెడ్పీటీసీ మోది రామాంజనేయులు మరోమారు డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో లేనివారి పేర్లు నమోదు చేస్తూ ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నారని ఇటీవల కలెక్టర్ హరినారాయణ న్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయగిరి ఏపీడీ గాయత్రిదేవి గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో లేని వారి పేర్లతో మస్టర్లు నమోదు చేసినట్లుగా గుర్తించారు. అయితే ఈ అవినీతికి బాధ్యులైన వారిపై ఇంత వరకు చర్యలే చేపట్టలేదు. దీంతో జెడ్పీటీసీ మరో మారు డ్వామా పీడీకి ఫిర్యాదు చేయడంతో పీడీ స్పందిస్తూ విచారణకు సంబంధించిన నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గడప గడపలో వచ్చిన ఫిర్యాదులపై దృష్టి



మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

సంగం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు నాగరాజు సూచించారు. సంగం సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పథకాల అమలు తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రేషన్‌కార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం, మల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో భగవద్గీత పోటీలకు శిక్షణ

ఆత్మకూరు: పట్టణానికి చెందిన గీతాజ్ఞాన యజ్ఞ సమితి ఆధ్వర్యంలో పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్త పోటీలు త్వరలో నిర్వహించనున్నట్లు, అందుకు ఆయా పాఠశాలల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సమితి నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, నిర్వాహకులతో సంప్రదించినట్లు, ఆసక్తి ఉన్న విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల, కంఠస్త పోటీల్లో పాల్గొనేందుకు ప్రతి రోజు ఓ గంట సమయం కేటాయించి వారితో సాధన చేయించనున్నట్లు తెలిపారు. సిద్ధమైన విద్యార్థులకు మండల, జిల్లా స్థాయిలో కంఠస్త పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని సమితి నిర్వాహకులు కోరారు.

వర్క్ చార్జ్‌డ్ రాష్ట్ర కార్యదర్శిగా రామయ్య



రామయ్యను అభినందిస్తున్న తోటి ఉద్యోగులు

చేజర్ల (సోమశిల): వర్క్ చార్జ్‌డ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పలపాటి రామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడ గాంధీనగర్ ఎన్జీఓ హోంలో జరిగిన వర్క్ చార్జ్‌డ్ కమిటీ ఎన్నికల్లో అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న ఉప్పలపాటి రామయ్యను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. రామయ్య మాట్లాడుతూ వర్క్ చార్జ్‌డ్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలు త్వరగా వచ్చేలా కృషి చేస్తానన్నారు.

రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు



పరికరాలు అందిస్తున్న హార్టికల్చర్ అధికారిణి జయశ్రీ

దుత్తలూరు: రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు, 50 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు మంజూరు చేస్తుందని ఉదయగిరి హార్టికల్చర్ అధికారిణి జయశ్రీ తెలిపారు. మంగళవారం మండలంలోని భైరవరంలో బిందు తుంపర్ల సేద్యం కింద సబ్సిడీ ద్వారా రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ బోర్లు, బావులు కలిగిన వ్యవసాయ రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకునే వారికి ఈ పరికరాలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ దినేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉపేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో అగ్రస్థానం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సంక్షేమ పథకాల అమల్లో మన రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా కుల, మత, ప్రాంత, పార్టీలు, రాజకీయాలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గతంలో మాదిరిగా పథకాల కోసం కార్యాలయాలు చుట్టూ తిరగకుండా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షోభాలెనున్నా.. సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. చంద్రబాబు తన హయాంలో కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం రామాయపట్నం పోర్టు కాని, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కానీ నిర్మించాడా అని ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే అన్నారు. ఎలాంటి లంచాలు లేని సమాజాన్ని సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు ఎంతో నమ్మకం ఏర్పరచుకున్నారని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం సాధించారో చెప్పలేక, చేసిందీ ఏమీ లేక, జగనన్నను బూతులు తిడుతూ శాపనార్థాలు పెడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుబమార్ రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నంబూరి వెంకటేశ్వర్లురెడ్డి, పలకా వెంకటేశ్వర్లురెడ్డి, వేమిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వేలమూరి జగదీష్‌రెడ్డి, పులిమి గోపాల్‌రెడ్డి, మేదరమెట్ల జయరామిరెడ్డి, శెట్టిపల్లి రమేష్, గుండాబత్తిన వెంకట్రావు, దావులూరి మాలకొండయ్య, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కుందుర్తి కామయ్య, కనపర్తి రాజశేఖర్, షేక్ జిలానీ బాషా, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపితే ఉద్యోగావకాశాలు



కళాశాల విభాగంలో విన్నర్లుగా నిలిచిన ఎస్‌ఆర్‌జేడీ కళాశాల విద్యార్థులు



సబ్ జూనియర్ విభాగంలో విన్నర్లుగా నిలిచిన సెయింట్‌మేరీస్ పాఠశాల విద్యార్థులు

- ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని వాటిల్లో ప్రతిభ చూపితే భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగావకాశాలు దక్కుతాయని లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరిగిన ఫ్రెండ్స్ క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ పోటీలు ముగిశాయి. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు పలువురు మాట్లాడుతూ 23 టీమ్‌లు పాల్గొనగా డిగ్రీ, ఇంటర్మీడియట్, పదో తరగతి మూడు విభాగాలుగా చేసి మూడు విభాగాలుగా పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల, జూనియర్స్ విభాగంలో బీఎస్సార్ జూనియర్ కళాశాల, సబ్ జూనియర్ విభాగంలో సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు విన్నర్లుగా నిలిచారు. ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాల (సీనియర్), బీఎస్సార్ కళాశాల (జూనియర్), మేధా పాఠశాల (సబ్ జూనియర్) విద్యార్థులు మూడు విభాగాల్లో రన్నర్లుగా నిలిచారు. విన్నర్లు, రన్నర్లకు షీల్డ్‌లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు ప్రెసిడెంట్ మెంటా వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఎస్ సంతోష్‌కుమార్, సోమిశెట్టి కిరణ్‌కుమార్, సెయింట్‌మేరీస్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి పేదల స్థలాలకు విముక్తి కల్పిస్తా

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యేకు తమ సమస్యలు చెబుతున్న వృద్ధుడు

కావలి: పట్టణంలోని బుడమగుంట ఎస్సీ కాలనీలో పేదలకు చెందిన ప్రభుత్వ ఇంటి స్థలాలను కబ్జా చేసిన వారి నుంచి విముక్తి కల్పించి అర్హులైన పేదలందరికీ పట్టాలు పంపిణీ చేయిస్తానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి చెప్పారు. పట్టణంలోని 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎస్సీ కాలనీకి వెళ్లినప్పుడు పలువురు తమ సమస్యను తెలిపారు. దీంతో స్థానికులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్డీఓ, తహసీల్దార్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాలను ఎంత విస్తీర్ణంలో ఆక్రమించుకుని ఉన్నారు, ఎవరు ఆక్రమించుకున్నారనే విషయాలను నిర్ధారించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విచారణ అనంతరం కబ్జాదారులు నకిలీ పట్టాలు సృష్టించి ఉంటే వాటిపై ప్రత్యేకంగా పోలీసులు ద్వారా విచారణ జరిపి వారిపై కూడా కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన వారందరికీ వెంటనే ఇంటి పట్టాలు అందించడమే కాకుండా, ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వ పక్కాగృహాన్ని కూడా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లపై సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆత్మకూరు: ప్రభుత్వం అందరికీ ఇళ్లు నవరత్నాలు పథకంలో భాగంగా ఇప్పటికే మంజూరైన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు వారి పేరిట రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు అన్నారు. కమిషనర్ చాంబర్‌లో మెప్మా సిబ్బంది, టీపీఎస్ ప్రవీణ్‌తో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాల్లో ఇప్పటికే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా టౌన్ ప్లానింగ్ కార్యదర్శి ప్రవీణ్‌ను సంప్రదించాలన్నారు. నెలాఖరులోపు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఓ మాధవి, సునంద, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో జీఈఆర్ సర్వే మేరకు బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలల్లో చేర్చేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు అన్నారు. జీఈఆర్ సర్వేపై ఏసీఎస్‌ఆర్ కాలనీ సచివాలయం, ఆర్డీఓ ఆఫీస్ ప్రాంగణంలోని సచివాలయంలో మంగళవారం ఆయన సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఒక స్పెషల్ డ్రైవ్‌గా ఈ పని చేయాలని సూచించారు. ఎక్కువ మందిని బడుల్లో ఉండేట్లుగా చేసి చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయించి వలంటీరు యాప్‌లో గ్రీన్ టిక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సచివాలయాల సిబ్బందికి తెలిపారు. పాఠశాలలు మానివేసిన 15 ఏళ్లు పైబడిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్, ఓపెన్ కాలేజీల్లో చేర్పేందుకు వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయాల సూపర్‌వైజర్ రాధ, ఆయా సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

కుక్కల పట్టివేత

సంగం: సంగంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిపై దాడి చేసిన నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంగళవారం గ్రామంలోని పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉన్న కుక్కలను పట్టుకుని బంధించారు. కుక్కలకు వెటర్నరీ సిబ్బందితో వ్యాక్సిన్ వేయించారు.



ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు

ఆత్మకూరురూరల్: ఏపీఎస్‌ఆర్‌టీసీలో అతి పెద్ద అసోసియేషన్‌గా ఉన్న ఏపీపీటీడీ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపునిస్తూ మంగళవారం 97వ నంబరు జీఓ ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చాలా ఏళ్లుగా తాము చేస్తున్న వినతులు చేస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు ఇచ్చారన్నారు. అన్ని డిపోలు, యూనిట్లలో ఉద్యోగులు అందరూ పాలాభిషేకాలు చేపట్టి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేవారిని ఎంపిక చేసేందుకు మండల స్థాయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ షేక్ నజీర్ బాషా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్‌బాడ్మింటన్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్, తదితర క్రీడల్లో అండర్-14, 17 బాలబాలికలకు ఈ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే ఈ పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొనవచ్చునని పీడీ తిరుపతయ్య అన్నారు. మండల స్థాయిలో రాణించిన వారికి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. వివరాలకు 80086 85873 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్

కలిగిరి: కలిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి శుక్రవారం వరకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ సురేష్ మంగళవారం తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునని ఆయన సూచించారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాల మైదానంలో బుధ, గురువారాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జలదంకి మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పీవీ రమేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండల స్థాయిలో అండర్-14, అండర్-17 బాలురు, బాలికలకు ఈ పోటీలు ఉంటాయన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, వాలీబాల్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారిని ఈ నెల 15వ తేదీ నెల్లూరులో జరిగే జిల్లా ఎంపికలకు పంపిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మండలంలోని ఏ పాఠశాలలోనైనా రెగ్యులర్ విద్యార్థులుగా చదువుతూ ఉండాలన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగాలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాట్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రంథాలయంలో తనిఖీ



గ్రంథాలయంలో పరిశీలిస్తున్న కుమార్‌రాజ

సంగం: సంగంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించి లైబ్రేరియన్ రవీంద్ర రెడ్డికు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 61 శాఖ గ్రంథాలయాలు, రెండు గ్రామ గ్రంథాలయాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు.

రెచ్చిపోతున్న దొంగ పట్టాల తయారీదారులు

- కబ్జాదారులను కట్టడి చేయాలి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు



మాట్లాడుతున్న పందిటి కామరాజు, పక్కన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలో కబ్జాదారులు, ప్రభుత్వ స్థలాలకు దొంగ పట్టాలు తయారు చేసే ముఠా యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు అన్నారు. కావలిలో మంగళవారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి కామరాజు విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మకాలనీ, బుడమగుంట ఎస్సీ కాలనీ, చంద్రబాబునగర్, ముసునూరు ఇందిరమ్మకాలనీ, మందాటి చెరువుకట్ట తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేస్తూ, నకిలీ పట్టాలు సృష్టించి అమ్మకాలు చేస్తున్నారన్నారు. కావలిలో గతంలో పనిచేసిన కొందరు అధికారుల సహకారంతో ఈ ముఠా చెలరేగి పోతుందన్నారు. తహసీల్దార్‌గా 30 ఏళ్ల క్రితం పదవీ విరమణ చేసి, కాలం చేసిన వ్యక్తి పేరుపై కూడా పట్టాలు కోకొల్లలుగా ముఠా తయారు చేసి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తుందన్నారు. ప్రభుత్వ లేఅవుట్లలో ఓపెన్ స్థలాలను వదిలేస్తే, వాటిని ఆక్రమించి ఈ ముఠాలు ప్లాట్లుగా లేఅవుట్ వేసి దర్జాగా అమ్మకాలు చేస్తున్నారని చెప్పారు. డబ్బున్న వ్యక్తులు కబ్జాదారుల నుంచి స్థలాలు సొంతం చేసుకోగలుగుతున్నారన్నారు. కావలిలో ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేసే ముఠా, నకిలీ పట్టాలు తయారు చేసే ముఠాలపై కలెక్టర్, ఆర్డీఓలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పేదలు ఈ ముఠా వల్ల చాలా రకాల వేధింపులు, పోలీసు కేసులతో మనోవ్యధకు గురతున్నారన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేష్‌బాబు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత

ఆత్మకూరురూరల్: గ్రామ స్థాయిలో ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంబంధిత శాఖల అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్, విద్య, వైద్య అంగన్‌వాడీ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి ప్రారంభించనున్న ముందుగానే గ్రామ వలంటీర్లు తమ క్లస్టర్ల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే చేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సర్వే నిర్వహించే తేదీలను ప్రదర్శించాలన్నారు. ఆయా తేదీల్లో ప్రత్యేక డాక్టర్ల బృందం హాజరై రోగులను పరీక్షిస్తారని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు సంబంధిత వైద్యశాలలో తీసుకెళ్లి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు పీజే దేవానంద్, అనూషా మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాల నిర్వహణలో వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈఓ నజీర్‌బాషా, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, ఐసీడీఎస్ ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఈ నెల 15 నుంచి ఆరోగ్య సురక్ష

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ రాజేష్ బాబు తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యశాఖ, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శుల ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య విషయాలపై సర్వే నిర్వహిస్తారన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి టోకెన్లు జారీ చేస్తారన్నారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వారికి స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్స చేసి మందులు అందిస్తారని తెలిపారు. ఆరోగ్య తీవ్రత ఉన్న వారిని గుర్తించి ఉచితంగా కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం అందిస్తారని చెప్పారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, చాకలికొండ వైద్యాధికారిణి సృజన, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

కలిగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.గీతారెడ్డి జగనన్న సురక్ష సర్వే విధి విధానాలపై వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఏంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్ రావు, వైద్యాధికారి మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష జయప్రదం చేయండి

దుత్తలూరు: త్వరలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.బ్రిజిత తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌరులు, ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడం, ప్రత్యేక పద్ధతిలో వారి ఆరోగ్య అవసరాలు తీర్చడం ప్రధాన లక్ష్యమన్నారు. డోర్ టు డోర్ విచారణ నిర్వహించి పౌరుల ఆరోగ్య అవసరాలు గుర్తించడం, తర్వాత చికిత్స, రెఫరల్ కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. శిక్షణ పొందిన వలంటీర్లు, వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు. తహసీల్దార్ సోమ్లానా యక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, వైద్యాధికారులు అయూబ్ అఫ్సర్, వనజ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన

చేజర్ల(సోమశిల): అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు జరిగింది. ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు హాజరయ్యారు. ఎంపీడీఓ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వలంటీర్లు, ఏఎన్‌ఎంలు సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం వైద్యాధికారిణి వరలక్ష్మి పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారంతోనే ఆరోగ్యం

చేజర్ల: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహార పదార్థాల తీసుకోవడం వల్ల ఎటువంటి రోగాలు దరిచేరవని ఆత్మకూరు సీడీపీఓ జి జైనకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని తూర్పుకంభంపాడు-2 అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలున్న ఆహార పదార్థాలను తీసుకోవాలని, పోషకాహార పదార్థాలను ప్రదర్శనను నిర్వహించారు. మండలంలోని ఏటూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం మాసోత్సవాలు నిర్వహించారు. ఏసీడీపీఓ పి సునీలత, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు సీహెచ్ సురేఖ, వై.సుబ్బరత్నమ్మ, టీకేపాడు ఎంపీపీఎస్ హెచ్ అంకయ్య, ఏటూరు సర్పంచ్ కే నాగభూషమ్మ, ఏటూరు ఎంపీపీఎస్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంవీ రత్నమ్మ, సీహెచ్ పద్మావతి, కామేశ్వరి, సౌభాగ్యమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రసన్న, అప్సరజాన్, కే వరలక్ష్మి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని కాటేపల్లి పంచాయతీ వన్నూరుపాళెంలో మంగళవారం పశుపోషకులకు పశువిజ్ఞాన బడిలో భాగంగా పశువుల ఆరోగ్యంపై పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలపై అవగాహన కల్పించారు. 1962 అంబులెన్స్ ఉపయోగాన్ని వివరించారు. అనంతరం నట్టల నివారణ మందును, గొంతువాపు టీకాలను పశువులకు వేశారు. జీవాలకు వచ్చే నోటిజబ్బు టీకాలు ఉచితంగా వేస్తారని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు గంగపట్ల కృష్ణ, సిబ్బంది హజరత్తయ్య, భార్గవ్, మహేష్, తమిదపాడు గొర్రెల సంఘం అధ్యక్షుడు గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



కృష్ణారెడ్డిపాళెంలో ఇళ్ల నిర్మాణపు పనులు పరిశీలిస్తున్న అధికారులు

కలిగిరి: గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో గృహాల నిర్మాణాలు వేగవంతంగా జరగడానికి చర్యలు తీసుకుంటున్నామని గృహ నిర్మాణశాఖ డీఈ రామకృష్ణ తెలిపారు. కృష్ణారెడ్డిపాళెంలోని జగనన్న లేఅవుట్‌లో గృహాల నిర్మాణాపు పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల కోరిక మేరకు 40 ఇళ్లను కాంట్రాక్టర్లు నిర్మిస్తున్నారన్నారు. పూర్తి నాణ్యతతో ఇళ్ల నిర్మాణపు పనులు వేగవంతంగా జరిగేలా స్థానిక అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు, కూలీలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పాముల తిరుపతయ్యను అదే గ్రామానికి చెందిన బాలిబోయిన వెంగమ్మ దుర్భాషలాడి దాడి చేసింది. ఈ విషయమై తిరుపతయ్య తల్లి ఆదిలక్ష్మమ్మ, భార్య ఆదిలక్ష్మి, కుటుంబ సభ్యులు కలిసి వెంగమ్మ ఇంటికెళ్లి నిలదీయడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఆదిలక్ష్మమ్మపై వెంగమ్మ రాయితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.